# బురఖా

రోషనారా !

ఎంత అందమైన పేరు ! ఆ పేరంటే నాకెంతిష్టమో ! పేర్లను చూసి ప్రేమించేవాళ్ళలో నేనే మొదటిదాన్ని. పేరుకు తగ్గట్టే ఉంటుంది రోషనారా. విరబూసిన తెల్ల గులాబీల్లాంటి కళ్ళు, అనార్‌పూలలా నవ్వినపుడు విచ్చుకునే పల్చటి పెదాలు, తెల్లటి దానిమ్మ గింజల్లా చక్కగా అమరిన పలువరుస, అన్నిటినీ మించి రాజసం ఉట్టిపడేలా ఒంపు తిరిగిన చుబుకం. . . .

అదృష్టంకొద్దీ మా కాలేజీ ఆడపిల్లలకే పరిమితం కాబట్టి సరిపోయింది. ఇదే గనుక కో ఎడ్యుకేషన్ కాలేజీ అయితే ఈ పాటికి ఎందరు యువకులు ఈ మొఘల్ సుందరి కోసం విరహంతో వేగేవారో ! ఎంత మంది ఈ పర్షియన్ మొగ్గ కోసం పరితపించి పిచ్చెక్కి పోయేవారో!

ఎటొచ్చీ రోషనారాలో నాకు నచ్చని విషయం ఒకటుంది . . . . ఇక్కడంతా ఆడపిల్లలమే అయినా బురఖా తీయకపోవటం. వాళ్ళ అల్లా అంత అపురూపంగా, అద్భుతంగా సృష్టించిన తన శరీరాన్ని నల్లటి ఆ పరదాలో దాచుకోవడం నాకు సుతరామూ నచ్చదు.

ఈ విషయంలో నేనెన్ని సార్లు రోషనారాతో వాదించానో ! అయినా ముఖం వరకూ తప్ప బురఖా తీయదెన్నడూ. . . .

నాకే గనుక రోషనారా అంత అందం ఉండి ఉంటేనా. . . నేను ముస్లింగా లేదు. పడ

పుట్టినా సరే ఎదిరించి దర్పంగా, గర్వంగా అందరికీ ప్రదర్శించి ఉండేదాన్ని. అదే తనతో అంటే. . .

"అందంగా ఉన్నంత మాత్రాన దాన్ని అందరికీ చూపించాలా" అంది రోషనారా. ఆమె పెదవులు కప్పుతూ నల్లటి పరదా ఉన్నా ఆమె కళ్ళు అనంత సౌందర్యాన్ని కురిపిస్తూ నవ్వుతున్నాయి.

"మరి అందం ఉన్నది దేనికి ఆరవేయటానికేగా, నేనే నీ అంత అందగత్తెనయి ఉంటే ఈ పాటికి హైద్రాబాద్‌ని ఏలేసి ఉందును" అన్నాను.

"నీ సౌందర్యానికేం హేలాపురి యువరాణిలా ఉంటావు" అంది ఆప్యాయంగా రోషనారా. పరిచయమైన కొత్తలో మావూరి పేరడిగితే బడాయిగా 'హేలాపురి' అని చెప్పినట్లు గుర్తు.

"సౌందర్యానికేంగానీ సౌందర్య పోషణలో మాత్రం తక్కువేం లేదు. మరి వాళ్ళ నాన్న బ్యాంకు మేనేజరాయె. అందమైన ఇల్లూ, మారుతీకారు" అంటూనే నా కెదురొచ్చి "అవునూ, నువ్వొకసారి కూడాకార్లో కాలేజీకి రావేం" అనడిగింది కల్పన. దానికి నేనంటే కడుపు మంట. నా చీరలు, మేకప్, హెయిర్‌స్టయిల్ ఇవన్నీ చూసి కుళ్ళు.

"మా నాన్నగారు చాలా ప్రిన్సిపుల్డ్. కార్ల లాంటి లగ్జరీస్ ఇప్పట్నించే అలవాటు చేసుకో కూడదంటారు" అన్నాను.

కల్పనా వాళ్ల నాన్నగారు పోస్టాఫీసులో ఆఫ్టరాల్ గుమాస్తా.

నా కళ్ళలో కదలాడిన చులకన భావం రోషనారా పసిగట్టిందనుకుంటాను.

"ఎవరి నాన్నలు ఏఏ హోదాల్లో ఉన్నారో తెల్సుకుని ఏమిటీ ప్రయోజనం- అంతరాలు పెంచుకోవటం తప్ప. అందుకే యూనిఫాంలు పెట్టారు. . . . ఖరీదయిన బట్టల్తో మన ఆధిక్యత చాటుకోకూడదని. బురఖా కూడా అలాంటిదే కదూ యూనిఫాంలా" అని చిన్నగా నవ్వింది రోషనారా.

☆ ☆ ☆

ఇల్లంటేనే నరకంలా ఉంటుంది నాకు. రెండు గదులున్న జైలులా. . .

ఉదయం మళ్ళా గొడవైంది.

నాన్నకు దీపావళి బోనస్ వచ్చింది. వెయ్యి రూపాయలు పెట్టి ఓ పంజాబీ డ్రెస్ కొనుక్కుంటానని చెప్పాను.

"వచ్చిందే వెయ్యి రూపాయలు. . .అంతా నీకే ఇచ్చేస్తే తమ్ముడికేం కొనను? క్రితం సారి కూడా అమ్మకు చీర కొనలేకపోయాను. అందుకే నీకు నాలుగు వందలు ఇస్తాను. నీక్కావల్సింది కొనుక్కో" అన్నాడు డబ్బులు లెక్కబెట్టి ఇస్తూ. . .

ఆ మొహంలో ఎప్పుడూ విచారమే. ఉత్సాహంగా ఎప్పుడైనా మాట్లాడాడా?

డబ్బులు కోపంగా విసిరేశాను. "పిల్లల కనీసపు కోర్కెలు కూడా తీర్చలేని వాడివి ఎందుకు కన్నావు?" అన్నాను కసిగా.

"ఖరీదయిన బట్టలు కనీసపు కోర్కెలని నాకు తెలియదమ్మా. అయినా అంత తాహతు నాకెక్కడిది. ఓ ప్రభుత్వ బంట్రోతుని. అయినా నీ మనసుకు కష్టం కలగకూడదనే నేనూ, అమ్మా, తమ్ముడూ మా అవసరాల్ని మానుకుని నీ కోర్కెలు తీరుస్తున్నాం" అన్నాడు.

"అంతా దరిద్రపు గోల. ఎపుడు విన్నా లేదూ, లేదూ అనటం తప్ప ఉందన్న పదం నేనెప్పుడైనా విన్నానా? ఈ కొంపలో పుట్టటమే నే చేసుకున్న మహాపాపం" అని విసురుగా బైటికొచ్చేశాను.

కాలేజీలోనైనా కొంత మనసుకు వూరట కలుగుతుందనుకుంటే ఈ కల్పన ఒకత్తె! డైనమైట్‌కి వత్తి ముట్టించినట్లు "మీ నాన్న గారు అశోక్‌నగర్ బ్రాంచిలోనే కదా మేనేజర్ అన్నావు. నిన్న అక్కడ పనుండి వెళ్ళానే. అలాంటి వాళ్ళెవరూ లేరని చెప్పారే" అంది కళ్ళు తిప్పుతూ.

చుట్టూ ఫ్రెండ్స్ ఉన్నారు. అందరిలో కుతూహలం.

"ఓహ్! మీకు చెప్పటం మరిచానే! ఓ నెల క్రితమే ఉప్పల్ బ్రాంచ్‌కి ట్రాన్స్‌ఫరైంది" అన్నాను వత్తిని ఆర్పేసే ప్రయత్నంలో.

"మరి ఆ విషయం అయినా చెప్పి ఏడ్వచ్చుగా. వాళ్ళు అసలు ఆ పేరున్న వ్యక్తి తమ బ్యాంక్‌లోనే లేరని చెప్పారేంటీ" అంది కల్పన.

"మా నాన్నగారు చాలా స్ట్రిక్ట్ అని చెప్పాగా. స్టాఫ్‌కి వారంటే గిట్టదు. అందుకే అలా కూసి ఉంటారు" అన్నాను.

నాకు కసిగా ఉంది. ఈ కల్పన బుర్రని గోడకేసి బాదేయాలన్నంత కోపంగా ఉంది.

అసలు దీనికెందుకు ఆ ఆరాలన్నీ? ఆ మొహం చూడు. నల్లటి రంగు, తెల్లటి పారపళ్ళు, తాట్రోడ్డులాంటి ముక్కు- ఫస్ట్ ర్యాంక్ కోసం రోషనారాతో పోటీపడేంత తెలివి కూడా స్వతహాగా వచ్చింది కాదనుకుంటాను. ఆ అందవిహీనతను కప్పిపుచ్చుకోవడానికి ఏదో విధంగా, ఏదో ఓ రకంగా మెప్పు సంపాదించాలన్న పట్టుదల, తను అందంగా లేదు కాబట్టి తన తెలివిని పెట్టుబడిగా పెట్టి పదిమందినీ ఆకర్షించాలన్న తపన . . . .

"దీన్నెవరు పెళ్ళి చేసుకుంటారే. వృద్ధకన్యగా ఉండిపోవాల్సిందే" అన్నాను రోషనారాతో.

"తప్పు. అలా అనకు! కల్పనకేం. . . చాలా మంచి అమ్మాయి" అంది రోషనారా.

"ఏం మంచి. ఆ మొహం ఎంత వికారమో మనసూ అంతే వికారం" అన్నాను అసహ్యాన్నంతా మాటల్లో నింపుతూ.

"ఆమె స్థానంలో మనం ఉన్నా ఇలానే ప్రవర్తించి ఉండేవాళ్ళం. ఆమెకు మంచి మనసున్న - అర్థం చేసుకునే సహృదయుడైన భర్త దొరకాలని మనందరం కోరుకుందాం" అంది రోషనారా.

నాకు పీకల్దాకా కోపం వచ్చింది.

"ఎప్పుడూ ఈ బురఖా ఏమిటి? నీ మాటల్లో ఉన్న ప్రోగ్రెసివ్ నేచర్ నీ చేతల్లో కన్పించదు. నీవొక హిపోక్రైట్‌వి" అనేశాను.

ప్రశాంతంగా వింది రోషనారా. "ఏ మతంలో అయినా కొన్ని నియమాలు మేలు చేసేవే ఉంటాయి. నా విషయంలో బురఖా కూడా అంతే. ఎప్పటినుంచో పోరుతున్నావు కదా. ఈ రోజు సాయంత్రం నాతో పాటు మా ఇంటికిరా. నీకు సమాధానం చెప్తాను" అంది.

☆ ☆ ☆

మట్టి గోడల ఇల్లు. ఇంట్లో అణువణువునా పేదరికం పేరుకుపోయి ఉంది.

వాళ్ళమ్మను పరిచయం చేసింది రోషనారా. ఆమెకు నలభై యేళ్ళకంటే తక్కువ వయసుంటుంది. కానీ యాభై ఏళ్ళ దానిలా కన్పిస్తోంది. మొహంలో ముడతలు కన్పిస్తున్నా అందంగానే ఉంది.

"పదహారేళ్ళకే మా అమ్మకు పెళ్ళయింది. వెంటవెంటనే మూడు కాన్పులు. పేదరికం, అనారోగ్యం కలిసి మా అమ్మనిలా చేశాయి" అంది వాళ్ళమ్మను ప్రేమగా కౌగిలించుకుంటూ. రోషనారాలో నాకు మాతృవాత్సల్యం కన్పించింది. తన తల్లి తనకు బిడ్డలా. . . .

ఓ ట్రంకు పెట్టె దులిపి దానిమీద కూచోమంది. మట్టి కూజాలోంచి నీళ్ళు తెచ్చిచ్చింది. అంతటి పేదరికాన్ని జీర్ణించుకోలేకనుకుంటా గొంతు తడారిపోయింది. గట గటా గ్లాసుడు నీళ్ళూ తాగేశాను.

"నా కిద్దరు తమ్ముళ్ళు. వాళ్ళకు చదువు సరిగ్గా అబ్బలేదు. నేనొక్కదాన్నే మంచి మార్కుల్తో అన్నీ పాసవుతున్నానని తనకు నన్ను చదివించే తాహతు లేకున్నా కష్టపడి చదివిస్తున్నాడు నాన్న. ఉదయం ఎనిమిదింటికి అద్దె ఆటో తీసుకుని వెళితే

రాత్రి పదింటికిగానీ తిరిగిరారు. నా కోసం ఇలా శ్రమపడ్తున్న మా బాబా అంటే అందుకే నాకు ఎనలేని గౌరవం".

ఇలా మాట్లాడ్తూనే రోషనారా బురఖా విప్పదీసింది. వళ్ళంతాకళ్ళు చేసుకుని చూశాను. ఎంతటి అద్భుతమైన శరీరాకృతి! శిల్ప సుందరిలా, జలకన్యలా. . . . అంతటి అందమైన వంపుసొంపుల్ని బట్టబయలు చేస్తూ అతుకులు వేసిన పాత పంజాబీ డ్రెస్.

"చూశావా ఈ అతుకులు. . . . మా బతుకుల్లానే ! నేను కాలేజీలో చేరే ముందు 'మంచి మంచి దుస్తులు లేకుండా బేటీ కాలేజీకి ఎలా వెళ్తుందీ' అని నాన్నగారు తెగ దిగులు పడ్డారు. ఫీజులు కట్టడమే గగనంలా ఉన్న స్థితిలో మంచిడ్రెసెస్ ఆశించేంత మూర్ఖురాల్ని కాను నేను. అందుకే బాబాకు ఓ సలహా ఇచ్చాను. చౌకలో ఓ బురఖా కొనమని. నాకున్న రెండు పాతడ్రెసెస్‌కే అతుకులేసి వాటినే మార్చి మార్చి తొడుక్కుంటూ ఈ బురఖాలో దాచేసు కుంటున్నాను" అంది.

అప్పటి వరకూ నా కళ్ళకున్న మందమైన నల్లటి పరదాలు ఒక్కటొక్కటిగా విడిపోవడం ప్రారంభించాయి. నేను ఇన్నాళ్ళూ తొడుక్కుని గర్వపడిన అనేకానేక ముసుగులు కరెంటు తీగల్తో అల్లినట్లు. . . . వాటి ద్వారా హైవోల్టేజి ప్రవహిస్తున్నట్లు . . . అనంతమైన బాధ.

ఇంటికెళ్ళేప్పటికి అమ్మా, నాన్న, తమ్ముడూ అందరూ నా కోసం ఎదురు చూస్తున్నారు.

"కాలేజీ వదలగానే నేరుగా ఇంటికి రాకుండా ఎక్కడికెళ్ళావు తల్లీ. నా మీద కోపం వచ్చిందా. ఈ వెయ్యి రూపాయలూ నీవే తీసుకోమ్మా. నీ ఇష్ట ప్రకారమే కొనుక్కో!" అన్నాడు నాన్న డబ్బు నా చేతిలో పెడుతూ.

"వద్దు నాన్నగారూ! ఈ సారికి ఆ డబ్బుల్తో అమ్మకు మంచి చీర, తమ్ముడికి మంచి బట్టలు కొనండి" అన్నా మనస్ఫూర్తిగా.

నా సంబోధనలోని కొత్తదనానికో లేక నా మనసులో విరిసిన మెత్తదనానికో వాళ్ళల్లో ఆశ్చర్యానందం !

మరుసటి రోజు కాలేజీలో అనంత సౌందర్యంతో మెరిసిపోయేది కనిపించే బురఖా వేసుకున్న రోషనారా ఒక్కతే కాదు కనపడని బురఖాలు వదిలేసిన నేను కూడా అనిపించింది నాకు.

● *విపుల, డిసెంబర్, 98* ●